నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | మే 05, 2024 | www.navatelangana.com

## అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మండలం టేక్రియాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న నీటి ట్యాంక్ నిర్మాణం పనులను పరిశీలించారు. మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఈ సాయన్న, ఏఈ సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

## వడదెబ్బతో వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్ గేట్ -2 వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి వడ దెబ్బ తగిలి కింద పడిపోగా అతనిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సదరు వ్యక్తి మృతదేహం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురి గదిలో ఉందని, ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఎవరైనా బంధువులు, మిత్రులు ఉన్నట్లు అయితే 100 కి లేదా 3వ టౌన్ సిఐ ఫోన్ నెంబర్ 8712659836 కి లేదా ముడవ టౌన్ ఎస్ హెచ్ ఓ ఫోన్ నెంబర్ 8712659839 కి ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

# ఎన్నికలుంటేనే గుర్తుకొచ్చామా..?

- ఎండలో పనిచేస్తున్నా ఎప్పుడు ఎవ్వరూ పట్టించుకోలే
- నాయకులను నిలదీస్తున్న ఉపాధి కూలీలు
- ఉపాధి హామీ కూలీల ఓటు ఎవరికి?
- అన్ని పార్టీల చూపు కూలీల వైపే

నవతెలంగాణ-వర్ని



ఉపాధి కూలీల పని ప్రదేశంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు

పార్లమెంట్ ఎన్నికల భాగంగా బాన్సువాడ నియోజకవర్గంలో త్రిముఖ పార్టీల చూపు మహాత్మా గాంధీ ఉపాధి హామీ కూలీల వైపు పడింది. ఉదయం మొదట గ్రామీణ ప్రాంతాలకు రాగానే ఉపాధి కూలీలు ఎక్కడ పని చేస్తే అక్కడకు వెళ్లి మజ్జిగా, అరటి పండ్లు పంపిణీ చేసి వారి పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరడం ఒక ట్రెండ్‌గా మారింది.

**మిగతా రోజులలో వారి కష్టాలు కనబడవా**

ప్రభుత్వం చేపట్టిన ఉపాధి హామీ కూలీ పనికి తగ్గట్టు లోతు, పొడవు, వెడల్పు ఖచ్చితంగా పని చేస్తేనే వారికి ఆ రోజు కూలి పడుతుంది. కొలతలు తేడా ఉంటే ఎండలో వారు చేసిన కష్టానికి ఫలితం లేదు. దీనితో కూలీలు పని విషయం పలు మార్లు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరిగి అలసిపోయిన రోజులు ఉన్నాయి. అప్పుడు ఇదే ఎంపీటీసీ లకు, ఎంపీపీ లకు సర్పంచ్ లకు చెప్పిన పట్టించుకొనే నాథుడే ఉండలేదని ఇప్పుడు మేము కొండలలో , కొన్నాలలో, చెరువులలో ఉన్నా వచ్చి మాకు ఓటు వేయండి అని అడుగుతున్న ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తే ప్రచార ప్రజా ప్రతినిధులు నోరు మెదపటం లేదు అని కూలీల నుంచి ఆరోపణలు. ఓట్లు వస్తే మేము కనబడుతాము, మాకు ఇచ్చే పతకాలు ఎటు పోతున్నాయని అడిగితె ఒక పార్టీ, మరొక్క పార్టీల పేర్లు చెప్పుతున్నారు. అని కొన్ని చోట్ల నాయకులను ఉపాధి హామీ కూలీలు కడిగి పరిస్తున్నారని సమాచారం. మరి చివరికి ఉపాధి హామీ కూలీల ఓట్లు ఎటు పడుతాయి అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## స్టేషన్‌కు రారా.. సూస్కుందాం

- నవతెలంగాణ విలేకరితో దుర్భాషలాడిన ఎక్సైజ్ సీఐ గుండప్ప

నవతెలంగాణ-మోర్తాడ్

అతడో ప్రభుత్వ అధికారి. వారి కార్యాలయానికి సంబంధించిన ప్రజాపయోగ విషయాలను మీడియా ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అలాంటి సమాచారం తనకు రావడం లేదని అడిగిన నవతెలంగాణ విలేకరిపై ఓ ఎక్సైజ్ సీఐ దుర్భాషలాడారు. 'స్టేషన్‌కు రా సూస్కుందాం.. అయ్యఅవ్వకు పుడితే రారా' అంటూ పత్రికలో రాయలేని భాషలో దుర్భాషలాడారు. వివరాల్లోకి వెళ్తే.. మోర్తాడ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వాహనాల వేలం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన సమాచారం మీడియా ద్వారా ప్రజలకు అందించాల్సి ఉంది. ఇలాంటి ముఖ్యమైన సమాచారం తమకు ఇవ్వాలని నవతెలంగాణ మోర్తాడ్ విలేకరి విజయ్ కోరగా.. ఎక్సైజ్ సీఐ గుండప్ప దుర్భాషలాడారు. నా ఇష్టమున్నవారికి ఇచ్చుకుంటా అంటూ నిర్లక్ష్యమైన సమాధానం చెబుతూ నోటికి వచ్చిన విధంగా బూతు మాటలు మాట్లాడారు. కొందరికి కాకుండా అందరికి సమాచారం ఇచ్చేందుకు గ్రూప్‌లో పోస్టు చేయాలని సూచించినా వినిపించుకోకుండా తిట్ల దండకం అందుకున్నారు. గెజిటెడ్ స్థాయి అధికారి ఆ విధంగా ప్రవర్తించడం గమనార్హం. తన ఇష్టమున్న వారికి సమాచారం ఇస్తానని దమ్ముంటే స్టేషన్‌కు రారా అంటూ తిట్ల దండకం అందుకున్నారు. ఒక ఉన్నత స్థాయి పదవిలో ఉండి విలేకరులతో విచక్షణారహితంగా మాట్లాడడం విడ్డూరం.

**సర్వం గోప్యం**

మోర్తాడ్ ఎక్సైజ్ కార్యాలయ కేంద్రంగా జరిగే కార్యక్రమాలను గతం నుంచి సైతం గోప్యంగా ఉంచుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. బెల్ట్‌షాపులపై దాడులు, మద్యం స్వాధీనం, కల్లు డిపోలపై దాడులకు సంబంధించిన వివరాలు ఏమీ బయటకురాకుండా చూస్తుండేవారని అపవాదు ఉంది. కల్తీకల్లుకు సంబంధించి ఎవరైనా ప్రశ్నిస్తే.. గుల్బారమా..? అంటే ఏంటీ..? అని ఎదురు ప్రశ్నించడం గమనార్హం. సమాచారాన్ని గోప్యంగా ఉంచుతున్న సంబంధిత ఎక్సైజ్ సీఐపై ఉన్నత శాఖ అధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఆర్టీసీకి తాళాలు పడే రోజులూ తెచ్చారు

- కామారెడ్డి జిల్లాను రద్దు చేస్తారటా
- కాంగ్రెస్‌పై మాజీ ఎమ్మెల్యేలు ఫైర్


మాట్లాడుతున్న గంపగోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి

'కాంగ్రెస్ పార్టీ మోస పూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారంటీలు అని చెప్పి మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించి ఆర్టీసీని నష్టాల్లోకి తెచ్చింది. రేపు ఆర్టీసీకి తాళాలు పడే రోజులూ వస్తాయని' మాజీ ఎమ్మెల్యేలు గంపగోవర్ధన్, జాజాల సురేందర్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ నివాసంలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. 2 లక్షా రూపాయలు రుణ మాఫీ అనీ చెప్పి ఇప్పటికీ రుణ మాఫీ చేయలేదన్నారు.

కామారెడ్డి బిడ్డలు ఒక్క ఆలోచనా చేయాలనీ, సిఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలను రద్దు చేస్తా అంటున్నడని, కామారెడ్డి జిల్లాను రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి ఖబడ్దార్ కామారెడ్డి జిల్లా ముట్టుకుంటే కామారెడ్డి జిల్లా ప్రజలు తరిమి తరిమి కొడతారని అన్నారు. బీజేపి పార్టీ రాముడి పెరు మీద భజన చేస్తోందని దేశానికి ఏమీ చేసిందీ లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే కరెంట్ కష్టాలు మొదలు అయినాయని అన్నారు.తెలంగాణా తెచ్చుకుంది మన నిధులు మన నియామకాల కోసం అన్నారు. ఆంధ్రలో చంద్ర బాబు ముఖ్యమంత్రి అయితే తెలంగాణ కుడా రద్దు చేయాలని ఈ ముఖ్యమంత్రి రేవంత్ చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ఎంకే ముజిబుద్దిన్ పాల్గొన్నారు.

# ఐదేండ్లు అధికారంలో మేమే

- ఇచ్చిన హామీలు అమలు చేసి తీరుతాం
- కామారెడ్డి జిల్లా రద్దు.. పిచ్చికూతలే
- 9 లేదా 10న ప్రియాంకగాంధీ, రేవంత్‌రెడ్డితో భారీ సభ
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

'మేము ఐదేళ్ల అధికారంలో ఉండబోతున్నాం. సిగ్గు లేకుండా బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ప్రెస్ మీట్ పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తు న్నారు. కామారెడ్డి జిల్లాను రద్దు చేయబోతున్నారనీ, రుణమాఫీ చేయలేదని కారు కూతలు కూస్తున్నాడు. నేను బతికున్నంత వరకు కామారెడ్డి జిల్లాగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో కామారెడ్డి జిల్లా రద్దు కాదు. ఆగస్టు 15 వరకు 2 లక్షల రుణమాఫీ చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో వాగ్దానం చేసినట్టు' ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ శెట్కార్ లు శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

షబ్బీర్ అలీ మాట్లాడుతూ 'ప్రియాంక గాంధీ రేవంత్ రెడ్డిల సభ అనివార్య కారణాల వల్ల ఆరున కాకుండా 9 లేదా 10కి వాయిదా పడిందన్నారు. 'కాలేజీ భూములు అమ్ముకున్న వాళ్లు, ఎమ్మెల్సీ టికెట్ అమ్ముకున్న అవినీతిపరుడు ఈరోజు అవినీతి గురించి మాట్లాడుతున్నారు. ఆర్టీసీ లాభాల్లో ఉంది గాని నష్టాల్లో లేదు ఆర్టీసీలో మహిళల రవాణా చార్జీ ప్రభుత్వం చెల్లిస్తుంది. కెసిఆర్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పది సంవత్సరాల్లో విడతలవారీగా చేయడంతో మిత్తిలకు కూడా సరిపోలేదు. రైతులకు పండించిన పంటను కనీస మద్దతు ధర పెట్టి ప్రభుత్వం కొనలేకపోయింది. ఎందరో రైతులు పంట కుప్పల పైనే ప్రాణాలు వదిలారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక ఎలాంటి ఇబ్బందు లేకుండా పండించిన పంటను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. మీరు చేసిన అభివృద్ధి ఏమి లేక ఈరోజు జిల్లాలు రద్దు చేస్తారు, రైతు రుణమాఫీ రద్దు చేయడం లేదు అని చౌకబారు మాటలు చెప్పి ప్రజలవద్దకు పోవాలని చూస్తున్నారు. ఇప్పుడు ప్రజలుకాదు మీ నాయకులే మిమ్మల్ని నమ్మడం లేదు అందుకే అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. స్వయాన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారే కరెంటు కోతలు లేకుండా రైతులకు విద్యుత్ అందించాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన విద్యుత్ అధికారులపై చర్య తీసుకుంటానని అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శనివాసరావు, పట్టణాధ్యక్షుడు పళ్ళ రాజు, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్యూ వద్దు.. క్యూ ఆర్‌కోడ్‌తో సులభం

- జీజీహెచ్‌లో ఓపీ కోసం లైన్ నుంచి విముక్తి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



క్యూఆర్ కోడ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఇక క్యూ ఆర్ కోడ్ లతో ఓపి క్యూ నుండి రోగులకు ఉపశమనం లభించనుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ తెలిపారు. జిజిహెచ్‌లో క్యూఆర్ (స్కాన్ అండ్ షేర్) సేవలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) నిజామాబాదులో ఇక క్యూఆర్ కోడ్ ద్వారా ఓపి సేవలు అందుబాటులోకి వచ్చాయి అని, ఈ సేవల ద్వారా ఓపి కోసం వరుసలో నిలబడే ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులు ఏబిడిఎం అనే ఆప్ ద్వారా ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి వచ్చి న క్యూ నెంబర్‌ను ఓపి కౌంటర్లో చెబితే ఓపి కార్డు జారీ చేస్తారని తెలిపారు.

## అపరాధ రుసుంతో ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు 13

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

అపరాధ రుసుంతో ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు ఈ నెల 13వ తేదీ వరకు చెల్లించుకునే అవకాశం ఉందని గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి రాం మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2017 సంవత్సరనికి ముందు డిగ్రీలో చేరిన విద్యార్థులు, పునః ప్రవేశం 2017వ సంవత్సరానికి సంబంధించిన బ్యాక్ లాక్ పరీక్ష ఫీజు కట్టుకోవడానికి రూ. 200 అపరధరుసుముతో ఈనెల 06 వరకు, 500 అపరాధరుసుముతో ఈనెల 13 వరకు చివరితేదీ అని అధ్యాయన కేంద్ర రిజినల్ కో ఆర్డినేటర్ కె. రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం వారికి ఈనెల 17 నుంచి 20 వరకు ఉదయం 10 నుంచి 1 గంట వరకు, రెండవ సంవత్సరం వారికి ఈనెల 24 నుంచి 29 వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు, ముడవ సంవత్సరం వారికి ఈనెల 17 నుంచి 22 వరకు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల పరీక్షలు ఉన్నందున విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్ష ఫీజు కట్టుకోగలరని తెలిపారు. మరింత సమాచారం కోసం వెబ్ సైట్ www.braouonline.in సంప్రదించగలరు అని అన్నారు.

## ధాన్యం సేకరణ ముమ్మరం చేయాలి

- అదనపు కలెక్టర్ చంద్ర మోహన్

నవతెలంగాణ-కామారెడ్డి

రాగల మూడు రోజులలో జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో ధాన్యం సేకరణ ముమ్మరం చేయవలసినదిగా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని మార్కెట్ కమిటీలో, రామేశ్వరపల్లి లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను, క్యాసంపల్లి లో ఓం సాయి వెంకటేశ్వర రైస్ మిల్లును, ఉగ్రవాయ్ లో గురు రాఘవేంద్ర రైస్ మిల్లును తనిఖీ చేసి నిర్వాహకులకు, రైస్ మిల్లు యజమానులకు, లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు , రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షాలు పడనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, రాత్రి పొద్దుపోయాక కూడా ధాన్యాన్ని కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు అవసరమైన లారీలను కేంద్రాలను అందించాలని, రైస్ మిల్లర్లు హమాలీలను ఎక్కువ పెట్టుకొని లారీ వచ్చిన వెంటనే అన్ లోడ్ చేసుకొని ట్రక్ షీట్ జారీచేయాలని కోరారు. ధాన్యం రాసులు తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లను కేంద్రాల నుండి తీసుకొని ధాన్యం కుప్పలపై కప్పాలని రైతులకు సూచించారు. ఇదే రోజు గత ఏడాది యాసంగి తో పోలిస్తే రికార్డు స్థాయిలో ఒక లక్ష 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అధికంగా కొనుగోలు చేశామని చంద్ర మోహన్ తెలిపారు. ఇప్పటి వరకు 325 కొనుగోలు కేంద్రాల ద్వారా 31,143 రైతుల నుండి సుమారు 387 కోట్ల విలువ గల 1,75,644 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 277 కోట్ల 64 లక్షలు రైతుల ఖాతాలో జమచేశామని, రైతులు కూడా సకాలంలో డబ్బులు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నారని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## డబ్బున్నోడికి ఓట్లు వేయకండి

- ప్రజా సమస్యలు తీర్చే వ్యక్తిని గెలిపించండి
- సింహం ప్రతిమతో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న స్వతంత్ర అభ్యర్థి గుర్రపు మచ్చేందర్

నవతెలంగాణ-మద్నూర్

జహీరాబాద్ పార్లమెంటు స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుర్రపు మచ్చేందర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం ప్రచార రథంతో మద్నూర్ మండల కేంద్రానికి చేరుకొని మండల కేంద్రంలోని పాత బస్టాండ్ లో పార్లమెంట్ ఎన్నికల పట్ల ప్రసంగించారు. డబ్బున్నోడికి గెలిపించుకుంటే అలాంటి వ్యక్తులు డబ్బు సంపాదనకే మొగ్గు చూపుతారని ప్రజా సమస్యలు పట్టించుకోరని ఇంతకుముందు ప్రస్తుతం జహీరాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థి బీబీ పాటిల్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్ ఎంపీగా గెలుపొంది జహీరాబాద్ పార్లమెంటుకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని అలాంటి వ్యక్తులు మళ్లీ పోటీ చేస్తున్నారని పని చేసే వ్యక్తిని గుర్తించి ఎంపిగా గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తనను గెలిపి స్తే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని జహీరాబాద్ పార్లమెంట్ ఎంతో వెనుకబడిన ప్రాంతమని ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని నిరుద్యోగ సమస్య తీరుస్తానని తెలిపారు. సింహం గుర్తుకు ఓటు వేసి తనని గెలిపించాలని కోరారు.

## విద్యుత్తు భద్రత పై అవగాహన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్తు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా డి5 సెక్షన్ పరిధిలో అర్బన్ ఏడిఈ టౌన్ -2 తోట రాజశేఖర్ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ లు పోతే లైన్‌మెన్‌కు, ఏఈకి ఫోన్‌లో సమాచారం అందించాలని, రైతులు స్వయంగా ఫూజులు వేయొద్దని సూచించారు. ఆ ప్రయత్నంలో ప్రమాదం జరిగే అవకాశం ఉంది అని, అందుకు సంబంధించిన లైన్‌మెన్‌కు తెలిపాలని చెప్పారు. ఐఎస్ఐ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని సూచించారు.

## మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌లో ప్రతి అంశంపై

# స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి
- నిశితంగా పరిశీలించాలి : కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారులు

మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగలుగుతారని ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి అన్నారు. మాక్ పోల్, తదనంతరం చేపట్టే పోలింగ్ ప్రక్రియలు నిబంధనలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతున్నాయా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలూ ఉన్నాయా లేవా అన్నది గమనించాలని, సీక్రెట్ పోలింగ్ కంపార్ట్మెంట్ సరిగానే ఏర్పాటు చేశారా అన్నది పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సాంకేతిక లోపాల వల్ల ఈ.వీ.ఎం లు పనిచేయకపోతే, వాటి స్థానంలో వేరే ఈ.వీ.ఎం లను ఎలా అమరుస్తున్నారు అన్నది పరిశీలన చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలని, టెండర్, ఛాలెంజ్ ఓటింగ్‌లు జరిగితే వాటి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అయితే పోలింగ్ ప్రక్రియ తీరుతెన్నులను పరిశీలించడం వరకే మైక్రో అబ్జర్వర్ల బాధ్యత అని, ఎక్కడ కూడా పోలింగ్ విధుల్లో జోక్యం చేసుకోకూడదని కలెక్టర్ హితవు పలికారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటికప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై, సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం లోనికి వచ్చిన ఓటర్లు ఇంకను మిగిలి ఉంటే, వారిని వరుసక్రమంలో నిలబెట్టి చివరి నుండి ముందు వరుసలో ఉన్న ఓటరు వరకు క్రమ సంఖ్య చీటీలు అందించి పోలింగ్ జరిపించాల్సి ఉంటుందన్నారు. ఈ అంశాలన్నింటినీ మైక్రో అబ్జర్వర్లు నిశితంగా పరిశీలించాలన్నారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లను అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు ప్రభావితం చేయకుండా నిఘా ఉంచాలని, ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా, ఇతరులెవరిని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందిస్తున్న శిక్షణ తరగతుల్లో సూచించిన అంశాలను చక్కగా ఆకళింపు చేసుకుని సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ ఎలా సాగుతున్నదని గమనించడమే మైక్రో అబ్జర్వర్ల పాత్ర అని అన్నారు. జిల్లాలో రిజర్వు సిబ్బందితో కలుపుకొని 99 మంది మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తున్నామని, ఆకళింపు చేసుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా నిశితంగా పరిశీలించాలని ఏదేని సంఘటన జరిగితే మీ నివేదికలు కీలకమని అన్నారు. కాబట్టి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎక్కడ జోక్యం చేసుకోరాదని అన్నారు. తమకు కేటాయించిన లొకేషన్ లలో 2,3 పోలింగ్ బూతులు ఉన్నా ఆయా కేంద్రాలలో విద్యుత్, మంచినీరు, ఫర్నీచర్, వీల్ చైర్, రాంప్ వంటి మౌలిక వసతులు ఉన్నాయా గమనించాలన్నారు. ప్రతి పోలింగ్ బూతుకు సంబందించేసి విడివిడిగా నివేదికలు ఇవ్వాలన్నారు. ఈసీ ఐ మార్గదర్శకాల మేరకు మాక్ పోలింగ్ నిర్వహించి కంట్రోల్ యూనిట్ క్లియర్ చేశారు, వివిప్యాట్ స్లిప్స్ తీసి బ్లాక్ కవర్ లో సీల్ చేశారా, ఒక పార్టీకి ఒకరే పోలింగ్ ఏజెంట్ ఉన్నారా, ప్రిసైడింగ్ అధికారి టైం టు టైం డైరీ రాస్తున్నారా గమనించాలని, పోలింగ్ అనంతరం వివిప్యాట్, ఏవిఎంల సీలింగ్ సరిగ్గా జరిగిందా చూడాలన్నారు. 18 అంశాలకు సంబంధించిన నివేదికను ఎప్పటికప్పుడు జనరల్ అబ్జర్వర్‌కు నేరుగా పంపాలని సూచించారు. 17-ఏ రిజిస్టర్ నిర్వహణ, పోల్ పూర్తి అయ్యేంత వరకు జరిగే ప్రక్రియపై నివేదికలు ఇవ్వాలని, ఎన్నికల నిర్వహణలో అవకతవకలు జరిగితే జనరల్ అబ్జర్వర్ కు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు వరదా రెడ్డి, రాజారామ్, రఘునాథ రావు , మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
ఆదివారం | మే 5, 2024 | www.navatelangana.com



## నీరు లీకేజీ.. ఏర్పడిన గుంత

- వాహనదారులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


గుంతగా మారిన రోడ్డు

నవతెలంగాణ-వర్ని
మండలంలోని జాకోరా గ్రామంలో వర్ని నుంచి బడాపహాడ్ వెళ్లే ప్రధాన తారు రోడ్డుపై నీటి లీకేజీతో గుంత ఏర్పడింది. దీనితో రహదారి మీదుగా ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందిగా మారింది. గత రెండు నెలల నుంచి ఇలాగే ఉన్నా.. గ్రామ ప్రత్యేక అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులు సైతం చేపట్టడం లేదు.

## విశ్వకర్మ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- డివిజన్ అధ్యక్షులు గద్దె గంగాధర్

నవతెలంగాణ-ఆర్మూర్
ఇటీవల విడుదలైన ఇంటర్, పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విశ్వకర్మ విద్యార్థులకు వివా (విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కార అవార్డులను ప్రతి మండలం నుంచి ఇద్దరికీ ప్రదానం చేయనున్నట్టు డివిజన్ అధ్యక్షులు గద్దె గంగాధర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచి జీపీఏ సాధించిన డివిజన్‌లోని విశ్వకర్మ పిల్లల జిపిఏ వివరాలను బయో డేటాను గద్దె గంగాధర్ 9490006312, ఎం.సత్యనారాయణ 9440038459 నెంబర్లకు పంపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారామ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తల ప్రచారం

నవతెలంగాణ-పొతంగల్
మండలంలోని హంగార్గ ఫారం (జీపి)లో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గాలి అనీల్‌కుమార్ గెలుపు కొరకు ఇంటింటా ప్రచారం పార్టీ కార్యకర్తలు శనివారం నిర్వహించారు.

## అలరించిన నటరాజ నృత్యానికేతన్ చిన్నారుల ప్రదర్శన


ప్రశంసాపత్రాలను అందుకున్న నృత్యానికేతన్ చిన్నారులు

నవతెలంగాణ-ఆర్మూర్
ఇందూర్ యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హరిచరణ మార్వాడి పాఠశాలలో నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో భాగంగా శనివారం పట్టణంలో గల నటరాజ నృత్యనికేతన్‌కు చెందిన 15 మంది చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఇందుకు గానూ చిన్నారుల ప్రదర్శనకు అతిథులు మంత్రముగ్ధులై ప్రశంసాపత్రాలు, శాలువాలతో సత్కరించినట్టు నాట్య గురువు బాశెట్టి మృణాళిని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

## రామాలయ నూతన కమిటీ ఎన్నిక


సన్మానం పొందిన ఎన్నికైన సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్
మండలంలోని గోవింద్‌పేట్ రామాలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా విశ్వజ్ఞ గోవర్ధన్, కమిటీ సభ్యులుగా బండమీది సుభాష్, విశ్వనాథ్, అనిల్, వన్నెల గిరిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ రాములయ కమిటీ చైర్మన్ ధోన్‌పాల్ రాజేశ్వర్, నోముల నవీన్, అంది మహేష్, రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నవనాథ సిద్దేశ్వర పిరమిడ్‌లో పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న పిఎస్ఎస్ఎం అధ్యక్షులు సాయికృష్ణరెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్
రాష్ట్రంలో అతిపెద్ద రెండవ పిరమిడ్ శ్రీ నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యానమహాశక్తి క్షేత్రం 7272 నిర్మాణంలో భాగంగా ఫ్లోరింగ్ పనులను శనివారం పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయికృష్ణరెడ్డి కొబ్బరి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగద్గురు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఈ పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎన్ నవనాథపురం కమిటీ సభ్యులు కూనంటి శేఖర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్, మునిపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ సతీమణి ఆయేషా ఫాతిమా


కూలీలతో కలిసి పనిచేస్తున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే సతీమణి, జెడ్పీ చైర్మెన్

నవతెలంగాణ-నవీపేట్
మాయమాటలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని నమ్మి మరోసారి మోసపోవద్దని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమీర్ సతీమణి ఆయేషా ఫాతిమా అన్నారు. శనివారం మండలంలోని మోకన్‌పల్లి, నారాయణపూర్, జన్నేపల్లి, లింగాపూర్ గ్రామాలలో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయేషా ఫాతిమా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఇప్పటివరకు కళ్యాణలక్ష్మి, గృహలక్ష్మి, రెండులక్షల రుణమాఫీ ఇలాంటి పథకాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కాబట్టి కెసిఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అందుకే బిఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని అన్నారు. రాజకీయ అనుభవం.. ప్రశ్నించే గొంతుకైన బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించి తెలంగాణ గొంతుకను ఢిల్లీలో వినిపించేందుకు ఓట్లు వేసి గెలిపించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విటల్ రావు కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, తెడ్డు పోశెట్టి, అబ్బన్న, గొంటి రాజు, జనార్ధన్, అల్లం రమేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిదాలకు తావివ్వొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన
- కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ కోసం ఈవీఎంలను అన్ని విధాలుగా సిద్ధం చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా కమిషనింగ్ ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల వారీగా కమిషనింగ్ జరిపించాలని సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శనివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. ఓట్ల లెక్కింపు చేపట్టనున్న సీఎంసీ కళాశాలలోనే నిజామాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాల డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఈ కేంద్రాలను సందర్శించి కమిషనింగ్ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరిపారు. అదేవిధంగా బోధన్ పట్టణం విజయ మేరీ పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో కొనసాగుతున్న కమిషనింగ్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు చేశారు. బ్యాలెట్ యూనిట్లు, వివి.ప్యాట్లలో బ్యాలెట్ పేపరు, అభ్యర్థులకు కేటాయించబడిన ఎన్నికల గుర్తులను అమరుస్తున్న తీరును పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఈవీఎంలలో అమర్చే పవర్ ప్యాక్స్, రోల్స్ సరిపడా ఉన్నాయా అని ఆరా తీసిన కలెక్టర్.. అవసరమైన పక్షంలో మరిన్ని సమకూరుస్తామని అన్నారు. అలాగే బోధన్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను సైతం కలెక్టర్ సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ వివరాలతో కూడిన రిజిస్టర్లను పరిశీలించి, ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఎంతమంది ఓటు హక్కును వినియోగించుకున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, బోధన్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

# విద్యుత్ కోతలు లేవు

- నిరంతరంగా విద్యుత్ అందిస్తున్నాం
- ఎస్ఈ రవీందర్
- బోధన్‌లో ఘనంగా విద్యుత్ వారోత్సవాలు ప్రారంభం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

నవతెలంగాణ-బోధన్
వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందిస్తున్నామని నిజామాబాద్ ఎస్.ఈ రవీందర్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విద్యుత్ భద్రత వారోత్సవాలలో భాగంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌ను ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించినప్పుడే భావితరాలకు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో ఈ కార్యక్రమంలో వివరించారు. ప్రమాద రహిత తెలంగాణగా మార్చడానికి అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సిబ్బంది అధికారులు అందించిన రక్షణ సాధనాలను ఉపయోగించి విధులు నిర్వహించాలని, అంతేకానీ నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. ఈదురు గాలులు వీసినప్పుడు కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు పడినప్పుడు ప్రజలు వాటిని ముట్టుకోకుండా వెంటనే స్థానిక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేకానీ చెట్ల కొమ్మలను స్వయంగా తీసి ప్రమాదానికి గురికావొద్దని హెచ్చరించారు. విద్యుత్తు పొదుపు భద్రతతో కూడిన పనులు సంస్థ ప్రగతికి రథచక్రాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి ఏఈ కృష్ణ, బోధన్ టౌన్ ఏఈ ఆనంద్, కళ్యాణ్ బోధన్ టౌన్ ఏఈ-2, చందూర్ ఏఈ మిథున్ , పొతంగల్ ఏఈ నర్సారెడ్డి, రుద్రూర్ ఏఈ శ్రీనివాస్, బోధన్ ఏఓ రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 6న సమావేశం



మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
పార్లమెంటరీ సమావేశాన్ని ఈనెల 6న నిర్వహించనునట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికలలో ఇండియా కూటమి సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపించాలని సిపిఐ నిజామాబాద్ పార్లమెంటరీ సమావేశం ఈనెల 6 తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు నగరంలోని ఫిట్టర్స్ యూనియన్, ఏఐటియుసి కార్యాలయం (కాలూర్ రోడ్డు నూతన కలెక్టరేట్) వద్ద సమావేశం నిర్వహించనునట్టు తెలిపారు. కార్యక్రమానికి సిపిఐ జాతీయ నాయకులు కామ్రేడ్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్యపద్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ సమావేశానికి పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల, శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-నవీపేట్
దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం సాధ్యమవుతుందని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాళేశ్వర్, బినోల, ఆశాజ్యోతి కాలనీలలో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. నిత్యావసర ధరలను మూడింతలు పెంచిందని, ఏడాదికి లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఎక్కడ కూడా నెరవేరలేదని తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని రోజురోజుకు నీరుగారుస్తోందని తెలిపారు. జీఎస్టి పేరుతో లక్షల కోట్లు పన్ను వసూలు చేస్తున్నా.. అభివృద్ధి మాత్రం శూన్యమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే ఉపాధి హామీని మరింత పటిష్టం చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులు, మెడికల్ కాలేజీలు రోడ్లు వేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. కాబట్టి రాజకీయంగా అపార అనుభవం ఉన్న జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ కుమార్‌గౌడ్, గోవర్ధన రెడ్డి, రామ్ చందర్, బాలరాజ్‌గౌడ్, బాబు, మూస, జబీర్ పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడానికే బీఆర్ఎస్


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-భీంగల్ రూరల్
బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు సేవ చేయడానికే ఉందని, ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేసి గెలిపించాలని మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బెజ్జోర, పిప్రి(జె) గ్రామాలలో ఉపాధి హామీ కూలీలను కలిసి మాట్లాడారు. ఎంపీ అరవింద్ తెస్తానన్న పసుపు బోర్డు ఎక్కడుందో చూపించాలని, గల్ఫ్ పాలసీ ఎక్కడా..? అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూగజీవాలకు నీటిఎద్దడి ఉండొద్దు

- అందుకు అధికారులు చర్యలు చేపట్టాలి
- రెంజల్ సర్వసభ్య సమావేశంలో కోరిన మండల ప్రజాప్రతినిధులు
- పలు ముఖ్యమైన అంశాలపై తీర్మానం

నవతెలంగాణ-రెంజల్
వేసవిలో ఎండలు మండిపోతుండడంతో మూగజీవాలకు తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు సంరక్షణ బాధ్యతలను చేపట్టాలని మండల ప్రజాప్రతినిధులు కోరారు. శనివారం ఎంపీపీ రజిని కిషోర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని వీరన్నగుట్ట హైస్కూల్ ప్రహరీ గోడను ఇటీవల అధికారులు తొలగించారని, దీంతో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వీరన్న గుట్ట ఎంపీటీసీ గంగలత భూమేష్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని వారు పేర్కొన్నారు. నీలా గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పని చేయకపోయినా అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం చేసి నాయకుల సమావేశాలకు వెళ్లారని ఎంపీటీసీ గడ్డం స్వప్న రామచందర్ ఆరోపించారు. ఇంచార్జ్ ఏపీవో శరత్ చంద్ర కలుగజేసుకొని కూలీలు పనికి వచ్చిన వారందరూ తమకు నిర్వహించిన కొలతల ప్రకారం పని చేసుకోని వెళ్లాలని సూచించామని, అవసరమైతే సోమవారం దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తానని ఆయన స్పష్టం చేశారు. వీరన్నగుట్ట గ్రామంలో శ్రీనిధి రుణాలను ఇవ్వడానికి నానరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎంపీటీసీ ఆరోపించారు. రెంజల్ మండల కేంద్రంలోని ఎస్సి బాలుర వసతి గృహంలో 100 మంది విద్యార్థులు ఉండగా వచ్చే విద్యా సంవత్సరం 30 మంది వెళ్లిపోతారని మిగతా మండలంలోని ఐదు కిలోమీటర్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్ పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులు విదేశాలలో చదువు నిమిత్తం వెళ్లే వారికి ప్రభుత్వం రూ.20లక్షల వరకు ఆర్థిక సాయం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల సౌకర్యార్థం సాంఘిక సంక్షేమ శాఖ ఉచిత కోచింగ్, భోజన సదుపాయం ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు. ఇకనుంచి పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పేరు మీద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎంఈఓ గణేష్‌రావు పేర్కొన్నారు. అయా పాఠశాలలోని మౌలిక వసతులను అవసరాలను గుర్తించి స్థానిక ఏఈ జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదించి నిధులు మంజూరు అయ్యేలా చూస్తారని ఆయన పేర్కొన్నారు. జూన్ 12న తిరిగి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను అందజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. హెచ్ఐవి పాజిటివ్ కుటుంబాలను గుర్తించి వారికి అవగాహన కల్పించనున్నట్లు కిరణ్మయి తెలిపారు. కౌమారదశలోనున్న విద్యార్థినీలకు హెచ్ఐవిపై అవగాహన కల్పిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో హెచ్.శ్రీనివాస్, జడ్పీటీసి మేక విజయ సంతోష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మునినాయక్, ఎంఈఓ గణేష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, విద్యుత్ ఏఈ లక్ష్మీనర్సయ్య, ఐకెపి ఏపీఎం చెన్నయ్య, ఇంచార్జ్ ఐసిడిఎస్ సూపర్వైజర్ గంగావేణి, హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్, ఎంపీటీసీలు గడ్డం స్వప్న, గంగాలత, రుక్మిణి, సంయుక్త, అసద్‌బేగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్‌సింగ్, పిఆర్ఏఈ వినయ్‌కుమార్, వ్యవసాయ విస్తీర్ణ అధికారిని కృష్ణవేణి, పశువైద్య అధికారి డాక్టర్ విట్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

## ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం



**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రేణుక శ్రీకాంత్ దంపతుల కూతురు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. విషయం తెలుసుకున్న టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి ఆపరేషన్ కొరకు తక్షణ సహాయంగా 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కుటుంబీకులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వీడిసి అధ్యక్షులు సూర్యకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మనోహర్, బాపురెడ్డి, బాల్ రెడ్డి, శ్రీనివాస్, రవి, అనిల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల వద్ద కాంగ్రెస్ నాయకులు ప్రచారం



**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల వద్ద కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అదేవిధంగా నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్పేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పోచారం గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్, లచ్చిరెడ్డి ,నాగిరెడ్డి, సంగమేశ్వర్ తోపాటు కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా, శేఖర్, ఇమామ్, విక్రమ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు కట్టుబడి ఉంటాం

- కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను గెలిపించండి
- పలు చోట్ల ప్రచారం

**నవతెలంగాణ-లింగంపేట్**

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలు చేస్తున్నట్టు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ప్రచారం చేపట్టారు.

**లింగంపేట్ :** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి సురేష్ షెట్కార్‌ను గెలిపించాలని లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి ఓటర్లకు వేడుకున్నారు. శనివారం లింగంపేట్ మండలంలోని జల్లిపల్లి, రాంపూర్, భవానిపేట్ గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని ఉపాధి పనుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఆరు గ్యారంటీలో అమలుపై మాట్లాడారు. ఎన్నికలు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది అని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందా అన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుల బుర్ర నారా గౌడ్, జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచులు నాగరాజు బన్నీ సక్రు రాజశేఖర్ రెడ్డి రామ్ రెడ్డి పోచయ్య రాజయ్య పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**మద్నూర్ :** మండలంలోని శేఖాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు కాంగ్రెస్ నాయకులు వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహిం చారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరాస్ సాయిలు ఆధ్వ ర్యంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వ హించారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఉపాధి కూలీలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



మౌనిక (ఫైల్)

**నవతెలంగాణ-కామారెడ్డి**

సిరిసిల్ల జిల్లాకు చెందిన యువతి కామారెడ్డి జిల్లా కేంద్రంలో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లా జిల్లా వీర్నపల్లి గ్రామానికి చెందిన గంగాధర మౌనిక (24) ఈ నెల 3న మధ్యాహ్నం సమయంలో కామారెడ్డిలో ఉన్న శ్రీ లక్ష్మీ హాస్పిటల్‌కు వచ్చి, ఇక్కడి నుంచి వాళ్ళ అమ్మ, కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ లభించలేదని కుటింబికులు తెలిపారు. శనివారం ఆమె తల్లి గంగాధర జ్యోతి పోలీస్ స్టేషన్‌కు వచ్చి దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నామని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఈమె ఆచూకీ తెలిసిన ఎవరైనా పోలీసులకు, కామారెడ్డి టౌన్‌లో తెల్పాలాన్నారు.

## సదరం క్యాంపు స్లాట్స్ బుకింగ్ నిలిపివేత

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్

**నవవతెలంగాణ-కామారెడ్డి**

ప్రతి నెలా 4వ తేదీన జిల్లాలోని వికలాంగత్వ నిర్ధారణ కొరకు ఏర్పాటు చేయబోయే సదరం క్యాంపులకు విడుదల చేయవలసిన స్లాట్స్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిపరమైన ఇబ్బందులవల్ల నిలిపివేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి చందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సాంకేతిక సమస్య పరిష్కారమైన పిదప తదుపరి తేదీని తెలియపరుస్తామని, ఇట్టి విషయాన్ని వికలాంగ సభ్యులందరికి తెలుపవలసిందిగా మీ సేవా కేంద్ర నిర్వాహకులకు సూచించామని ఆయన అ ప్రకటనలో తెలిపారు.

## నేడు రక్తదాన శిబిరం

- హాజరుకానున్న హైదరాబాద్ రేంజ్ డిఐజి

**నవతెలంగాణ-కామారెడ్డి**

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా జన్మదిన సందర్భంగా కర్షక్ బి.ఎడ్ కళాశాల కామారెడ్డిలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ రేంజ్ డిఐజి జైళ్ల శాఖ డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ హాజరుకానున్నట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు శనివారం తెలిపారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను, అభినందన పురస్కారాలను అందజేయనున్నట్టు తెలిపారు. తలసేమియా చిన్నారుల కోసం నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి యువత పెద్ద ఎత్తున రావాలని మరిన్ని వివరాల కోసం 9492874006 నెంబర్‌కి సంప్రదించాలని కోరారు.

## అథ్లెటిక్స్ క్రీడా శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి



శిక్షణ కేంద్రంలో పాల్గొన్న చిన్నారులు

**నవతెలంగాణ-దోమకొండ**

దోమకొండ మండలంలోని అంబారిపెట్ గ్రామంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి వేసవి శిక్షణ శిబిరాన్ని బీడిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మ సురేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని 14 ఏళ్ల వయస్సు లోపు ఉన్న విద్యార్థులు అందరూ అథ్లెటిక్స్ లో శిక్షణ శిబిరాన్ని వివినియోగించుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించి దేశానికి ప్రాతినిథ్యం వహించాలని కోరారు. రాష్ట్ర స్థాయి, దేశ స్థాయి అథ్లెటిక్స్ లో పాల్గొని మన రాష్ట్రానికి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావలని కోరారు. ఈ శిక్షణ శిబిరానికి నిర్వాహకులుగా అవుసుల. మహేంద్రచారి గారి ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు.

అథ్లెటిక్స్ కోచ్ నిర్వాహకులు అవుసుల మహేంద్ర చారి మాట్లాడుతూ శిక్షణ శిబిరం మే1 నుండి మే31 వరకు కొనసాగుతుందని, 14 సంవత్సరాలలోపు విద్యార్థులు అందరూ వివినియోగించుకోవాలని కోరారు.

## కామారెడ్డిలో ఓట్ ఫ్రమ్ హెూమ్



ఓటును వినియోగించుకున్న వికలాంగురాలు

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఓట్ ఫ్రమ్ హెూమ్ లో భాగంగా కామారెడ్డి పట్టణంలో ఎన్నికల సిబ్బంది శనివారం ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి ఈసీఐ నిబంధనలకనుగుణంగా ఓటింగ్ కంపార్ట్మెంట్ ఏర్పాటు చేసి వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు నుండి ఓట్లు వేయించారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి నియోజక వర్గంలో 114 మంది వృద్దులు, దివ్యాంగ ఓటర్లు ఉండగా మూడు రూట్లుగా విభజించామని అన్నారు. ప్రిసైడింగ్, సహాయ ప్రెసిడింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, ఒక పోలీస్ , విడియోగ్రాఫర్ తో కూడిన బృందం ఓటర్ల ఇంటికి వెళ్లి ఓటింగ్ ప్రక్రియను వీడియో చిత్రీకరించిందని తెలిపారు. బృందం ముందుగా టేక్రియాల్ లో రాము అనే వికలాంగుడు, వృద్ధులైన క్యాతం లక్ష్మవ్వ, గడ్డమీది లక్ష్మవ్వ లతో ఓటు వేయించారు. అనంతరం కామారెడ్డి పట్టణంలో పక్షపాతంతో బాధపడుతున్న కాకతీయనగర్‌కు చెందిన పండరి చారి, లేవలేని స్థితిలో ఉన్న శ్రీరాంనగర్ కాలనికి చెందిన పెద్ద మనిషి నడిపి గంగారాం, విద్యానగర్ కు చెందిన వికలాంగుడు ప్రశాంత్ కుమార్, అశోక్ నగర్ కు చెందిన వికలాంగురాలు వనజా రాణి తదితరులు ఇంటి వద్దే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చి వేయలేని స్థితిలో ఉన్న మాకు ఎన్నికల సంఘం ఇంటి వద్దే ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం, ఓటు గోప్యతకు కంపార్ట్ మెంట్ ఏర్పాటు చేసి ఓటు వినియోగించుకునేలా చక్కటి ఏర్పాట్లు చేయడం వల్ల మా ఓటు హక్కు వినియోగించుకున్నామని గర్వంగా ఉందని అన్నారు.

జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గంలో 85 మంది ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 140 మంది, కామారెడ్డి నియోజక వర్గంలో 114 మంది వృద్దులు, వికలాంగులు ఇంటి వద్ద నుండే ఓటు వేయుటకు ఫారం-12 అందించగా 12 రూట్ల ద్వారా హెూమ్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతున్నదని కలెక్టర్ తెలిపారు.

ఆదివారం హెూమ్ ఓటింగ్ జరుగుతుందని, తప్పక ఇంటివద్దనే ఉండి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, బిఎల్ ఓ లు పాల్గొన్నారు.



పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అబ్జర్వర్

# ఎన్నిక ఏర్పాట్లు పరిశీలన

**నవతెలంగాణ-మద్నూర్**

ఈ నెల 13న జరిగే జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక పోలింగ్ ఏర్పాట్లను జహీరాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్ గోపాల్జీ తివారి ఐఏఎస్ శనివారం మండల కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అబ్జర్వర్ గోపాల్జీ తివారి మండల కేంద్రంలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, పోలింగ్ కేంద్రాలను, అదేవిధంగా ఎన్నికల ఈవీఎం యంత్రాలకు నిర్వహిస్తున్న కమిషనింగ్ జరుగుతున్నా వాటిని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి సూచించారు. ఎన్నికలకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తపరిచారు. అబ్జర్వర్ పరిశీలనలో ఆయన వెంట జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నిక జుక్కల్ నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ఎండి ముజీబ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**నవతెలంగాణ-కామారెడ్డి**

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ను జాగ్రత్తగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం ఆర్.డి.ఓ. కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను,ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించు కున్న ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండాఓటింగ్ ప్రక్రియ సజావుగా, సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను జాగ్రత్త నిర్వహించాలని అధికారులకు తగు సూచనలు చేశారు. మైక్రో అబ్జర్వర్లు ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలన జరపాలని అన్నారు. జిల్లాలో 4,546 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలిష్ అధికారులు, ఉత్తర పోలింగ్ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకొనుటకు వీలుగా ప్రతి నియోజక వర్గంలో ఒక ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. జుక్కల్ నియోజక వర్గానికి సంబంధించి మద్నూర్ తహశీల్దార్ కార్యాలయంలో, ఎల్లారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో, కామారెడ్డి నియోజక వర్గానికి సంబంధించి ఆర్డీ ఓ కార్యాలయంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 4,5 తేదీలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్,పోలిసు అధికారులు, 6,7 తేదీలలో ఇతర పోలింగ్ సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. మొత్తంగా శనివారం నుండి మంగళవారం వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఓటర్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

## కోఆర్డినేటర్‌గా సాయిపటేల్ నియామకం

**నవతెలంగాణ-మద్నూర్**

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీని నియమించింది. ఈ కమిటీలో కోఆర్డినేటర్‌గా మద్నూర్ గ్రామానికి చెందిన సాయిపటేల్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది ఇలాంటి అతిపెద్ద పార్టీలో మద్నూర్ గ్రామ యువకుడు సాయిపటేల్ ఆయన పార్టీ బలోపేతానికి చేసే కృషిని గుర్తించి పార్లమెంట్ ఎన్నిక మేనేజ్మెంట్ కమిటీ కోఆర్డినేటర్‌గా నియమించడం పట్ల జుక్కల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా సాయి పటేల్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో పార్లమెంట్ ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, ఎలక్షన్ కమిటీ చైర్మెన్, ఏఐసీసీ కో ఆర్డినేటర్ కత్తి వెంకట స్వామి పత్యేక ధన్యవాదాలు తెలిపారు.



సాయిని సన్మానించిన ఎమ్మెల్యే

## హెూం ఓటింగ్‌పై అవగాహన

**నవతెలంగాణ-పిట్లం**

మండల కేంద్ర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రాబోయే ఎంపీ ఎన్నికలకు గాను వద్దులకు, వికలాంగులకు హెూం ఓటింగ్ పై సెక్రెటరీ యాదగిరి శనివారము అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారుల అధికారుల ఆదేశానుసారం పోలింగ్ బూతులకు నడిచి వెళ్లలేని వద్ధాప్య , వికలాంగులకు తమ ఓటు హక్కును ఇంటి వద్దనే వినియోగించుకొనుటకు ఎన్నికల నియమావళి రూపొందించిన సందర్భంగా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై ప్రత్యక్షంగా వికలాంగులకు , వద్దులకు అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.



ఓట్‌పై అవగాహన కల్పిస్తున్న సెక్రెటరీ

## ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ

# పకడ్బందీగా చేపట్టాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఈ నెల 13 న జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ కోసం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి ఆదేశించారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేపడుతున్న ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారితోపాటు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమిషనింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈవీఎంలపై సీరియల్ నెంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి, ఈవీఎంల పనితీరు పరిశీలించాలన్నారు. అలాగే స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ వివరాలను ఏఆర్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రఘునాథరావు, అధికారులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి, కలెక్టర్

## ఉపాధి పనిప్రదేశంలో కూలీ మృతి

- వడదెబ్బతోనే..?



మృతి చెందిన రాములు

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**

ఉపాధి పని ప్రదేశంలో పని చేస్తు కుప్పకూలి కూలీ మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట్ మండలంలోని జప్తిజాన్కంపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జప్తి జాన్కంపల్లి గ్రామానికి చెందిన భూమని రాములు (71) రోజువారీలాగా శనివారం ఉదయం జప్తి జానకంపల్లి శివారులో మల్లార్ చెరువులో ఉపాధి హామీ పనులు చేయడానికి వెళ్లారు. భూమని రాములు తన భార్య సాయవ్వతో కలసి పనిచేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి కూలీలు పరీక్షించగా మృతి చెందినట్లు నిర్ధారణ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటన స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించి మృతదేహాన్ని ఎల్లారెడ్డికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటి వరకు తమతో కలిసి పని చేసిన రాములు మృత్యువాత పడటంతో తోటి కూలీలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ప్రారంభం

**నవతెలంగాణ-మద్నూర్**

జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంను జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి డి.శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ప్రారంభోత్సవంలో మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ బ్యాలెట్ కేంద్రాన్ని ప్రారంభించిన శ్రీనివాస్‌రెడ్డి

## రాజకీయ పార్టీలు

# వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి

- విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్

**నవతెలంగాణ-కామారెడ్డి**

రాజకీయ పార్టీలు దివ్యాంగుల రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలనీ విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు చిప్ప దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 2.68 కోట్ల మంది దివ్యాంగులు ఉన్నా లోకసభలో ప్రాతినిధ్యమే లేదన్నారు. దివ్యాంగులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వ్యవస్థ వైఫల్యమేనని అవేదన వ్యక్తం చేశారు. ఇది తమ హక్కలకు భాగస్వామ్యాన్ని నిరాకరించడమేనని స్పష్టం చేశారు. ఎన్నికలపై ఏ విధమైన ప్రభావం చూపలేని వర్గంగానే దివ్యాంగులను రాజకీయ పార్టీలు పరిగణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అసమానతను సమాజం కల్పించిన వైకల్యంగా భావిస్తున్నామని ఆవేదనతో పేర్కొన్నారు. అందుకే రాజకీయ పార్టీలు సైతం వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్‌లు కల్పించి వికలాంగులకు టికెట్‌లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గాడి నర్సింలు, బంటు స్వామి, పురం శంకర్, బంజ రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

## ఊరూరా కాంగ్రెస్ ప్రచారం

**నవతెలంగాణ-కోటగిరి**

మండలంలోని బస్సాపూర్ గ్రామంలో మాజీ జెడ్పిటిసి, కాంగ్రెస్ నాయకులు జెడ్పిటిసి శివరాజ్ దేశాయ్ ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి పనులలో పాల్గొని కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇందిరమ్మ రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు రాములు, శివ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు

## హనుమాన్ ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల పూజలు

**నవతెలంగాణ-వర్ని(చందూర్)**

మండల కేంద్రంలోని హనుమాన్ మందిరంలో బిఆర్ఎస్ గ్రామ నాయకులు జహీరాబాద్ ఎంపీగా గెలువాలని కోరుతూ శనివారం పూజలు చేశారు. బాన్సువాడ అభివృద్ధి ప్రధాత.. మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువ నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. గ్రామ అధ్యక్షులు, ప్యాక్స్ చైర్మన్ ప్యారం అశోక్, ఎంపీపీ లావణ్య రాంరెడ్డి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

## 'హెూమ్ ఫ్రామ్ ఓటింగ్' ద్వారా ఓటు వేసిన సామ లింగవ్వ

**నవతెలంగాణ-ముప్కాల్**

ఈ నెల 13 సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సీనియర్ సిటీజన్లు, వికలాంగులకు ఇంటి వద్ద నుంచి ఓటు వేసేలా ఎన్నికల సంఘం "హెూమ్ ఫ్రామ్ ఓటింగ్" ద్వారా తన ఓటును వేసుకునే అవకాశాన్ని కల్పించిన విషయం తెలిసిందే. అయితే శనివారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన సామ లింగవ్వ తన ఓటును 'హెూమ్ ఫ్రామ్ ఓటింగ్' ద్వారా తన ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల ప్రతి బృందం అధికారులు తెలిపారు. శుక్రవారం ప్రారంభమైన ఈ అవకాశం ఈ నెల 6వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రతి బృందం పీఓ, ఓపీఓ, అబ్జర్వర్, పోలీసు సిబ్బంది, వీడియో గ్రాఫర్ తదితరులున్నారు.



ఓటు వినియోగించుకున్న లింగవ్వ

# ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్ర

- ఈ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు
- ఘనంగా మేడే వారోత్సవాలు


**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

2005లో పోరాడి సాధించుకున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు విమర్శించారు. అందుకోసం మే డేను స్ఫూర్తిగా తీసుకొని 70శాతంగా ఉన్న వ్యవసాయ కూలీలకు నష్టం తలపెట్టిన మోడీ ప్రభుత్వాన్ని మట్టి కరిపించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కూలీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వమూ మనుగడ కొనసాగించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఇందల్‌వాయి మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. 138వ మేడే ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ తరుణంలో దేశం క్లిష్ట పరిస్థితులలో ఉందని తెలిపారు. అలాగే దేశాన్ని శాసించే పార్లమెంటు ఎన్నికలు కూడా సమీపించిన నేపథ్యంలో దేశంలో ప్రధానమంత్రి మోడీ ఫాసిస్టు నియంతృత్వ పోకడలను అవలంబిస్తున్నాడని విమర్శించారు. ఎవరైతే వ్యవసాయ రంగాన్ని, కార్మిక చట్టాలను, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడి మరింత అభివృద్ధి చేస్తారో వారినే ఎన్నికల్లో గెలిపించాలని వ్యవసాయ కార్మికులకు పెద్ది వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాగుల గోవర్ధన్, గంగారాం, లక్ష్మి, అనూష, ఎల్లవ్వ, రాములు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మేడే ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

## విద్యుత్ సమస్యలుంటే పరిష్కరించుకోవాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

గ్రామాల్లో నెలకొన్న వివిధ విద్యుత్ సమస్యలుంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి పరిష్కరించుకోవాలని లైన్‌మెన్ కపిల్ అన్నారు. ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో విద్యుత్ వినియోగదారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 7వరకు విద్యుత్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎప్పుడైనా ఏదైనా ఇబ్బందులుంటే విద్యుత్ అధికారులకు సమాచారం అందజేయాలని సూచించారు. శాఖ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వినియోగదారులు సొంతంగా ట్రాన్స్‌ఫర్, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లి మరమ్మతులు చేపట్టి.. ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. అలాగే విద్యుత్‌ను ఆదా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తిరునగరి శ్రీధర్, భాస్కర్, నిహల్‌తో పాటు వినియోగదారులు తదితరులున్నారు.

# స.హ.చట్టం ఒక వజ్రాయుధం

- రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ సలీం
- స.హ.చట్టంపై అవగాహన

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

సమాచార హక్కు చట్టం అనేది పేదవాడికి ఒక వజ్రాయుధం లాంటిదని ఎంఏ.సలీం అన్నారు. నిజామాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సమాచార హక్కు చట్టం, హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం 2005పై అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ సలీం, అలాగే హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు, తెలంగాణ హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ చైర్మన్, సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ డిప్యూటీ డైరెక్టర్ సాహెల్ ఖాన్ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఏ.సలీం మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం అనేది పేదవాడికి ఒక వజ్రాయుధం లాంటిదని అన్నారు. ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని వినియోగించుకోవాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకత, జవాబుదారీ తనం ఈ చట్టం ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ సిరాజును రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకొని సన్మానించారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు సాహిల్ ఖాన్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు మానవ హక్కుల గురించి తెలుసుకోవాలని అన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా వాస్తవ్యులైన మొహమ్మద్ సిరాజ్‌ను హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. మహమ్మద్ సిరాజ్ సహా చట్ట పరిరక్షణ కమిటీలో కూడా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా విధులు కొనసాగిస్తున్నారు. ప్రతి మహిళ తమ హక్కుల గురించి, మహిళలు తమ చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు. ఈ సామూహిక అవగాహన కార్యక్రమంలో సహా చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ జి.హనుమంతు, ఎం.చంద్రశేఖర్, నిజామాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు షబానా, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు నూర్జహాన్, హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ వైస్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ కలిముద్దీన్, ఆర్తి ఎన్, సంతోష్, ఎ.రాజేందర్, ఫరీన్ బేగం, పల్లవి, కర్త, సనపటాన్, యాస్మిన్ షేక్, మహమ్మద్ సాదిక్, మహమ్మద్ ఫజల్, మహమ్మద్ యూనుస్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ. సలీం

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసిన ఉపాధ్యాయులు



ఓటుహక్కు వినియోగించుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు

**నవతెలంగాణ-కోటగిరి**

కోటగిరి ప్రభుత్వ ఉపాధ్యాయులు శనివారం బాన్సువాడలో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నారు. ఎన్నికల్లో భాగంగా ఉద్యోగ రీత్యా విధులు ఉండటంతో శనివారం పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నవారిలో కోటగిరి ఉపాధ్యాయులు కృష్ణమోహన్, బర్ల సాయిలు, భవాని, మల్లికార్జున్, వెంకటేష్ తదితరులున్నారు.

## సీఎం చిత్రపటానికి చెరుకు రసంతో రైతులు అభిషేకం



చిత్రపటాలకు చెరుకు రసంతో అభిషేకం చేస్తున్న రైతులు

**నవతెలంగాణ-బోధన్**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజాం షుగర్ ఫ్యాక్టరీలను సెప్టెంబర్ వరకు తెరిపిస్తామని, అలాగే బ్యాంకులకు చెల్లించవలసిన రూ.43 కోట్లు చెల్లించడంతో చెరుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సాలూర మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి చిత్రపటానికి చెరుకు రసంతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకు రైతులు మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్ల చెరుకు రైతుల చిరకాల స్వప్నమైన నిజాంషుగర్ ఫ్యాక్టరీ పున్నప్రారంభం చేయడానికి రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఫ్యాక్టరీ పున్నప్రారంభించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేయడం సంతోషకరమన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి చెరుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, బోధన్, సాలూరా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి, అల్లే రమేష్, అల్లే జనార్దన్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీహారి హన్మంత్‌రావు, చీల శంకర్, శీనన్న, సంజీవరెడ్డి, చెరుకు రైతులు మురిగే శంకర్, ఛిద్రపు రాములు, రమేష్, మార్కల్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు విధులపై ఒకరోజు శిక్షణ

**నవతెలంగాణ-బోధన్**

కోర్టు విధులపై బోధన్ డివిజన్ పోలీస్ అధికారులకు అదనపు పీపీలు బోధన్ కోర్టు ప్రాంగణంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీ నరసయ్య ఆదేశాల మేరకు బోధన్ కోర్టు ప్రాంగణంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు అదనపు పీపీ శ్యాంరావు తెలిపారు. ఈ శిక్షణలో భారతీయ న్యాయ సంహిత చట్టం 2023 గురించి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆయన వివరించారు. అలాగే భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 గురించి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వివరించారు. భారతీయ సాక్ష్య అదినియం న్యాయం 2023 గురించి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి వివరించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు వీరయ్య, కోల నరేష్, రుద్రూర్ సర్కిల్ సీఐ జయేష్‌రెడ్డి, వర్ని ఎస్ఐ క్రిష్ణకుమార్, ఎక్సైజ్ ఎస్సై ఎండి జలీలుద్దీన్, రుద్రూర్ ఎస్సై అప్పారావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వందన, బోధన్ కోర్టు పోలీస్ కానిస్టేబుల్, ఎక్సైజ్ కానిస్టేబుల్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన పలువురు పోలీసు అధికారులు

## హోమ్ ఓటింగ్ బ్యాలెట్‌ను ప్రారంభించిన ఎస్సై సాయన్న



హోమ్ ఓటింగ్ బ్యాలెట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని సాటాపూర్ గ్రామంలో హెూమ్ ఓటింగ్ బ్యాలెట్‌ను స్థానిక ఎస్సై ఈ.సాయన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఈనెల మూడు నాలుగు రెండు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం ఈ బ్యాలెట్‌ను ప్రారంభించామని ఆయన తెలిపారు. ఓటరు వారి ఇంటికి వెళ్లి బ్యాలెట్ బృందాలు ఓటు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఓటింగ్ బృందంతో పాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/బాల్కొండ/కోటగిరి**

మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం బిఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. బూత్ ఇంచార్జిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం జోరుగా సాగుతుంది. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీల అమలులో విఫలమైన విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఎంపీగా బాజిరెడ్డి గోవర్దన్‌ను గెలిపిస్తే అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ముందుంటారని, ఎంపీగా అరవింద్, ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి మండలానికి చేసిందేమీ లేదని ఇంటింటి ప్రచారంలో ఓటర్లకు వివరించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి తోడుగా ఎంపీగా బాజిరెడ్డి గోవర్దన్‌ను గెలిపిస్తే ప్రజల సమస్యల పరిష్కారంలో వారిద్దరు ముందుంటారని, కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా బాజిరెడ్డి గోవర్దన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బాల్కొండ నియోజక వర్గంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాలలో బీఆర్ఎస్ నాయకులు ఉపాధి పని ప్రదేశంలో కూలీలను కలిసి ప్రచారాన్ని నిర్వహించారు.

**బాల్కొండ :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని కిసాన్‌నగర్ గ్రామంలో బిఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేయాలని కోరారు. బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే మన గ్రామం అభివృద్ధి చెందుతుందని వారు ప్రజలకు ప్రచారం ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రామ్ రాజ్‌గౌడ్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు శరత్, బిఆర్ఎస్ నాయకులు అశోక్, రమాకాంత్, స్వామినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ ప్రచార హోరు..**

**కోటగిరి :** మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మైనార్టీ నాయకులు జుబేర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లి: కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



కోటగిరి: ఇంటింటా ప్రచారం చేస్తున్న నాయకులు



కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ పథకాలను చూసి గెలిపించండి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని, కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అమృత పూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, సీనియర్ నాయకులు గడీల రాములు, మండల కార్యదర్శి లచ్చమొల్ల దత్తాద్రి అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండలంలోని డిచ్‌పల్లి, రాంపూర్.డి, ఇందల్‌వాయి మండలంలోని మేగ్యానాయక్ తండాలలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మెనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీ ఆర్వింద్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ స్కీంలను అర్హులందరికీ అందిస్తుందని పేర్కొన్నారు. ఉపాధి

## కాంగ్రెస్‌లో చేరిన ముస్లిం సంఘం సభ్యులు

**నవతెలంగాణ-ఏర్గట్ల**

మండల కేంద్రానికి చెందిన 60 మంది ముస్లీం సంఘం సభ్యులు బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలుపు కోసం కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివ కుమార్, మైనార్టీ మండలాధ్యక్షులు మునీరొద్దీన్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, నాయకులు బద్దం లింగారెడ్డి, ఓర్సు రాములు, కల్లెడ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన పలువురు ముస్లింలు

## బాధిత కుటుంబానికి పరామర్శ

- ఆర్థిక సహాయం

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

వేల్పూరు మండలం లక్కోరా గ్రామానికి చెందిన గట్టు మమత ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సారెడ్డి, దామోదర్‌గౌడ్, ఆత్మా చరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

## కందకుర్తి చెక్ పోస్ట్ వద్ద తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ సాయన్న

నవతెలంగాణ-రెంజల్

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు రెంజల్ ఎస్సై ఈ.సాయన్న పేర్కొన్నారు. ఈ చెక్‌పోస్టు గుండా మద్యం, నగదు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తే వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన తెలిపారు.

## పట్టపగలే చోరీ..

- 10 తులాల బంగారం, 3 కిలోల వెండి చోరీ



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. గంట వ్యవధిలోనే దొంగలు ఇంటిని దోచేసిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం కలకలం రేపింది. ఈ ఘటన నాలుగో టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరంలోని వినాయక్‌నగర్ 100 ఫీట్ల రోడ్‌లోని నివాసముంటున్న పోస్టల్ డిపార్ట్‌మెంట్ సీనియర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మధు మోహన్ తన భార్యతో కలిసి శనివారం మధ్యాహ్నం కార్ షోరూమ్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి 45 నిమిషాల్లో ఇంటికి తిరిగి రాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. గుర్తుతెలియని దుండగులు బీరువాను ధ్వంసం చేసి అందులోని 10 తులాల బంగారు, రెండు కిలోల వెండిని అపహరించుకుపోయారు. ఈ మేరకు బాధితులు నాలుగో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వేలిముద్రలు, ఆనవాళ్లను సేకరించారు. కాగా స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# కాంగ్రెస్‌ను గెలిపించండి

- బీఆర్ఎస్ హయాంలో అవినీతి, అక్రమాలే..
- కార్నర్ మీటింగుల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ మండల పరిధిలోని గూపన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కుటుంబ దాసోహంతో చేసిన అవినీతి అక్రమాలను ఎండగట్టారు. లక్షకోట్లకు పైగా సంపాదించారని, కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాకుండా పోయిందని అన్నారు. ఓ దిక్కు కూతురు తీహారు జైల్లో బెయిల్ లేకుండా గడుపుతుందని విమర్శించారు. అలాగే బిజెపి ఎంపీ అభ్యర్థి అరవింద్ పసుపు బోర్డు తెస్తానంటూ గెలిచి హామీని విస్మ రించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో జీవన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, గూపన్‌పల్లి గ్రామశాఖ అధ్యక్షులు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దుద్దు లింగన్న, హన్మాండ్లు, భోజన్న పాల్గొన్నారు.

**గుండారంలో ప్రచారం..**

మండలంలోని గుండారం గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతుల సమస్యల, గల్ఫ్ బాధితుల సమస్యలు, బీడీ కార్మికుల సమస్యలు కాంగ్రెస్ పార్టీతో పరిష్కరించవచ్చని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాడ్సి శేఖర్‌గౌడ్, నగేష్‌రెడ్డి, అరికెల నర్సారెడ్డి, భూమరెడ్డి, ముప్పా గంగారెడ్డి, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, గ్రామశాఖ అధ్యక్షులు, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలి

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మోబీన్ ఖాన్


మాట్లాడుతున్న మోబీన్ ఖాన్

నవతెలంగాణ-రెంజల్

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని, ప్రభుత్వం హయాంలోనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్ స్పష్టం చేశారు. శనివారం మండలంలోని నీలా గ్రామంలోని ఉపాధి హామీ కూలీల వద్ద ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు పరచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డికి తమ అమూల్యమైన ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగభూషణంరెడ్డి, జి.సాయిరెడ్డి, గంగాకృష్ణ, గణేష్ నాయక్, వినోద్, గంగాకిషన్, అలీముద్దీన్, కర్రీమ్, సోక్కుల సాయిలు, సద్దాం, వెంకటేష్, ఎమ్మెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మున్నూరు కాపు సంఘం సభ్యులు


కాంగ్రెస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని శాపూర్ గ్రామంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో శాపూర్ మున్నూరు కాపు సంఘం సభ్యులు కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. వీరికి వినయ్‌రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అధ్యక్షులు నంగి మల్లయ్య, సదర్ భజన్న, ఉప్పరి ప్రవీణ్, నార్ల శ్రావణ్, గుర్రపు భోజన్న, సతీష్, సుధాకర్, రంజిత్, రాజలింగం, ఉద్దిరి రాజేందర్, కిరణ్, భజన్న, చిన్నయ్య, చేతన, గంగాధర్, లక్ష్మీనారాయణ, గంగారం, సాయన్న, సంతోష్, రాజేందర్, శ్రీనివాస్, నరసయ్య, అశోక్, రాములు, చిన్నయ్య, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


ప్రచారంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ వస్తేనే ఉపాధి హామీ బతుకు దెరువుకు గ్యారెంటీ ఏర్పడుతుందన్నారు. రోజు వారి కూలీ రూ.400కు పెంచుతామన్నారు. వేసవిలో 35 శాతం అదనంగా బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నిరుపేదల కోసం ఉపాధి హామీ చట్టాన్ని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందరూ జీవన్‌రెడ్డికి ఓటు వేసి మోపాల్ మండలం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మవద్దని, మన రాష్ట్రాన్ని దివాలా తీసింది కేసీఆర్ కుటుంబమని, అటువంటి దౌర్భాగ్య పాలన నుంచి విముక్తి పొందామని అన్నారు. ప్రజలు తిరస్కరించినా వారికి ఇంకా బుద్ధి రాలేదని, కారు షెడ్డుకు పోయిందని అన్నారు. బిజెపి నాయకులు దేవుడి పేరు చెప్పి రాజకీయాలు చేస్తున్నారే తప్పా అరవింద్ మన మండలానికి చేసిందేమీ లేదని, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా నిధులు ఇచ్చిన దాఖలాలు లేవని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పదని ఇప్పటికే ఆరు గ్యారెంటీలలో దాదాపు 5 గ్యారంటీలు అమలు చేశామని అతి త్వరలో రుణమాఫీ కూడా చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారని, అతి త్వరలో రుణమాఫీ కూడా సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గంగాప్రసాద్, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ లింగం, ఎంపీటీసీ రాములు తదితరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులను, నిరుద్యోగులను
# మోసం చేసిన బీజేపీ సర్కార్

- ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్


కాంగ్రెస్ గ్యారెంటీలను వివరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత పదేళ్ళలో కేంద్రంలో పరిపాలన సాగించిన బిజెపి మోడీ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందని, ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందని ఎన్ఎస్‌యుఐ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, తెలంగాణ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు బానోత్ సాగర్ నాయక్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ స్వామి ఆదేశాల మేరకు యూనివర్సిటీ ఉపాధ్యక్షులు బానోత్ సాగర్ నాయక్, నిజామాబాద్ అధ్యక్షులు వరదబట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలోని కేంద్రీయ గ్రంథాలయం వద్ద మొహబ్బత్‌కి దుకాణ్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యువ న్యాయ గ్యారంటీలను విద్యార్థులకు వివరించి పలువురిని రిజిస్ట్రార్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పదేళ్ళలో కేంద్రంలో పరిపాలన సాగించిన బిజెపి మోడీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపి నిండా ముంచిందని అన్నారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత చేతులు దులుపుకున్నారని, కనీసం ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహించి వాటి ద్వారా అయినా ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ బడా బాబులకు దేశాన్ని దోచిపెట్టే ఉద్దేశంతో కేవలం అంబానీ, ఆదానీ లాంటి కంపెనీలకే అన్ని రాయితీలు కల్పిస్తూ ప్రభుత్వ సంస్థలను వారికి ధారాదత్తం చేసి ప్రైవేట్ రంగాలను కూడా కుదేలు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు లేక దేశంలో నిరుద్యోగిత రేటు తారస్థాయికి చేరుతుందని పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో నిరుద్యోగులకు ఆకలి కేకలు తప్పవని సూచించారు. చదువుకునే యువత, చదువు పూర్తయి ఉద్యోగ వేటలో ఉన్న విద్యార్థి నిరుద్యోగ మిత్రులు మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి కంకణం కట్టుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా మోడీ దేశానికి చేసిందేమీ లేదని, కేవలం ప్రజల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి యువతను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. యువతలో విద్వేషం నింపి వారిని ఇతర మతాలపైకి ఉసి గొల్పడం కాదని బిజెపికి నిజంగా దేశ యువత పట్ల చిత్తశుద్ధి ఉంటే గత కాంగ్రెస్ ప్రభుత్వం లాగా ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలతోపాటు పరిశోధన సంస్థలు తెరవాలని వాటి ద్వారా మాత్రమే యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. అంతేకానీ మత విద్వేషాలు రెచ్చగొట్టి యువత భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి యువత, నిరుద్యోగులు మద్దతు తెలపాలని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఐదు యువ న్యాయ గ్యారెంటీలను అమలు చేస్తుందని అన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఐదు యువ న్యాయ గ్యారంటీల ప్లకార్డులను విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రూరల్ అధ్యక్షులు ఆశిష్, ఉపాధ్యక్షులు రమణ, ఆర్మూర్ నియోజకవర్గ ఎన్.ఎస్.యు.ఐ అధ్యక్షులు శశి, అఖిల్, ఆదిత్య, దినకర్, ప్రణీత్, శ్రీరామ్, సాయి, సాయికుమార్, యూనివర్సిటీ ఎన్ఎస్‌యూఐ కమిటీ సభ్యులు సందీప్, శ్రీను రాథోడ్, నవీన్, చందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎడపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్ నాయక్



నవతెలంగాణ-ఎడపల్లి

మండల పరిషత్ అధికారిగా శ్రీనివాస్ నాయక్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎడపల్లి ఎంపీడీవోగా ఇదివరకు బాధ్యతలు నిర్వహించిన గోపాలకృష్ణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు.

# ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- జాతీయ రహదారిపై వాహనదారుల ఇబ్బందులు


ఇరుకుగా మారిన వంతెన

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

63వ నంబరు జాతీయ రహదారి పెర్కిట్ నుంచి మొదలై మోర్తాడ్ మీదుగా జగిత్యాల్, కరీంనగర్, వరంగల్‌లకు ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మండలంలోని లక్కోరా జాతీయ రహదారిపై ఇరుకు వంతెన కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలాది వాహనాలు తిరిగే ఈ రహదారిపై లక్కోరా వద్ద చెరువు కింద ఉన్న వంతెన గత సంవత్సరం జూలై 23న కురిసిన అతి భారీ వర్షానికి ధ్వంసమైంది. వంతెన దెబ్బతినడమే కాకుండా వంతెనపై రోడ్డు మధ్యలో భారీ పగుళ్లు వచ్చాయి. వంతెనకు ఆనుకొని సుమారుగా 200 మీటర్ల రోడ్డు సైతం కోతకు గురికాగా, మట్టి పోసి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. పగుళ్లు వచ్చిన రహదారిపై వాహనాలు తిరిగితే ప్రమాదాలు జరుగుతాయని భావించిన సంబంధిత అధికారులు వంతెనపై దెబ్బతిన్న రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. దీంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. ఒకవైపు భారీ వాహనాలు వెళ్లిన తర్వాతే రెండోవైపు భారీ వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. దీంతో వంతెన వద్ద వాహనాలు దాటిపోవడం కష్టంగా మారుతుంది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా.. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గత కొన్ని నెలల క్రితం ఇదే వంతెనపై కారు, రెండు బైకులు ఒకేసారి ఢీకొనగా.. మండల కేంద్రమైన వేల్పూర్‌కు చెందిన, భీంగల్ మండలంలోని ముచ్కూరుకు చెందిన ఇద్దరి కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. వంతెన ఇరుకుగా ఉన్నట్లు దూర ప్రాంతాల వారికి రాత్రిపూట, కొత్తగా వచ్చేవారికి తెలియకపోవడంతో వంతెనను ఢీకొనే ప్రమాదం ఉంది. రాకపోకలకు వారధిగా ఉన్న జాతీయ రహదారి వంతెనను కూడా పట్టించుకోరా అని స్థానికులు వాపోతున్నారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-మోపాల్

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని కంజర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై గంగాధర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గూపన్‌పల్లి ప్రశాంత్ (33) మద్యానికి బానిసయ్యాడు. దీంతో కుటుంబంలో గొడవలు మొదలయ్యాయి. దీంతో భార్య తన పుట్టింటికి వెళ్లింది. సంసారానికి రాబోనని చెప్పడంతో మనస్థాపానికి గురైన ప్రశాంత్ శుక్రవారం అర్ధరాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వం పని కల్పించాలి

- నిజామాబాద్ ప్రభుత్వ లైసెన్స్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ పిలుపు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వం తమకు పని కల్పించాలని నిజామాబాద్ ప్రభుత్వ లైసెన్స్ ఎలక్ట్రీషన్ అసోసియేషన్ కోరింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ టౌన్ గవర్నమెంట్ లైసెన్స్ ఎలక్ట్రికల్ వైర్‌మెన్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ.. తాము కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్, ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నామని, కానీ తమకు ప్రభుత్వం ద్వారా ఎలాంటి ఆధారం లేదని అన్నారు.

ప్రభుత్వం ద్వారా ఎలక్ట్రికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్ పొంది ఉన్నామని, ప్రతి సంవత్సరానికి ఒకసారి ప్రభుత్వ పాలిటెక్నికల్ ద్వారా పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. 1956 ఇండియన్ ఎలక్ట్రికల్ నియమం ప్రకారం రూల్ 45వ ప్రకారం ఎలక్ట్రీషన్ ఇన్స్టాలేషన్ పనులు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్ తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్స్ నుంచి జారీ చేయడం జరుగుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో లైసెన్స్ హోల్డర్లకు మాత్రమే ఈ పనులు ఇవ్వాలని నియమం ఉందన్నారు. ప్రతి ఒక్క లైసెన్స్ హోల్డర్‌కు ప్రభుత్వం జారీ చేసిన లైసెన్స్‌తో పాటు యూనియన్ కార్డ్ కూడా ఉంటుందన్నారు. కావున ప్రభుత్వం తమను గుర్తించి ప్రభుత్వం ద్వారా నిర్మించే భవనాలు ఇతర సముదాయాలలో తమకు పనులు ఇప్పించాలని వారు కోరారు. అదేవిధంగా ఎలాంటి లైసెన్స్ లేకుండా కొంతమంది ఎలక్ట్రీషన్‌గా అవతారం ఎత్తి తమను తీవ్రంగా నష్టపరుస్తున్నారని తెలిపారు. వారు చేసిన పనుల్లో ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనిచేస్తూ ఎలక్ట్రీషయన్ వృత్తికి మచ్చ తెస్తున్నారని అన్నారు. కావున ప్రజలు, ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి మోసపోకూడదని వారు విజ్ఞప్తి చేశారు.